# భగ్గుమన్న బ్రతుకు


కురుమద్ది శరత్‌కుమార్

'బ్రతుకు బుగ్గి చేసిన సారా' కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ

**గుంటూరుకు ముప్పై కిలో మీటర్ల దూరంలో గల రామాపురం అనే గ్రామంలో కుమార్ అనే ప్రభుత్వోద్యోగి ఉండేవాడు. వయస్సు యాభై పైనే. ఇంకా ఆరు సంవత్సరాలు సర్వీసు ఉంది. ఆర్.టి.సి.లో మెకానిక్‌గా ఉద్యోగం చేసేవాడు.**

ఉద్యోగ రీత్యా ప్రతిరోజూ రామాపురం నుంచి గుంటూరుకు అప్ అండ్ డౌన్ చేసేవాడు. కుమార్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు. పెద్దకుమార్తె పేరు స్వప్న, ఇంటర్ వరకు చదువుకుంది, సంవత్సరం క్రితమే తనకు బాగా తెలిసిన బంధువుల అబ్బాయికి ఇచ్చి పెళ్ళి చేసాడు. అతను పట్టణంలో ఏదో ఉద్యోగం చేస్తాడట. చిన్నమ్మాయి సుందరి డిగ్రీ వరకు చదువుకుంది. ప్రస్తుతం బి.ఇడి ఎంట్రెన్స్ కోసం ప్రిపేర్ అవుతోంది. కొడుకు వర్మ డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు.

కుమార్ అన్ని విధాలా చాలా మంచివాడు, మనసున్న వాడు. అడిగినవారికి చిన్న, పెద్ద చూడకుండా అందరికి సహాయం చేస్తాడు.




కాని కుమార్‌కు ఉన్న ఒకే ఒక దుర్వ్యసనం మందు త్రాగటం. ప్రతిరోజు ఇంటికి తప్పకుండా తప్పతాగి వచ్చేవాడు. తన సహ ఉద్యోగులతో, తెలిసిన మిత్రులతో ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ తప్ప తాగి వస్తాడు. తన భార్య అన్నపూర్ణ, పిల్లలు ఎంతో బాధపడేవారు. ఈయన తాగుడు పట్ల ఎంతో దిగులు చెందేవారు. తాగుడు మాన్పించాలని ఎంతో ప్రయత్నం చేశారు. భార్య తనమీద ఎన్నోసార్లు ఒట్టు వేయించుకుంది. పిల్లల మీద ఒట్టు వేయించింది. కుమార్ మాత్రం ఒట్టుతీసి గట్టుమీద పెట్టి తన త్రాగుడు మాత్రం మానేవాడు కాదు. చెప్పిన మాటలు అన్నీ శ్రద్ధగా వింటాడు. కానీ తాగే తాగుడు మాత్రం ఆపడు.

కుమార్ తాగుడుకు ఇంట్లో వాళ్ళు బాధపడటం, ఆ బాధ వాళ్ళ జీవితాల్లో ప్రతిరోజు దినచర్య కావటం మామూలే అయిపోయింది. కుమార్ కుటుంబం కళ్ళ నుంచి నీరు కారని రోజు లేదు. ముఖ్యంగా అన్నపూర్ణ బాధతో ఏడ్చి, ఏడ్చి ఎన్నో, ఎన్నెన్నో నిద్రలేని రాత్రులు గడుపుతూ, రోజులు ఈడ్చుకుంటూ వస్తుంది.

కుమార్ మాత్రం తప్ప తాగుతూ, తన మిత్రులకు తప్ప తాగిస్తూ సారా లోకంలో విహరించేవాడు. బతుకు కన్న బాటిలే ముఖ్యమని భావించేవాడు. నోట్లో నుంచి ఎప్పుడో

కాని, రోజులో ఉద్యోగం సమయం మిన హాయిస్తే బాటిలే తీయడు. తన అసలు జీతం నెలకు ఏడువేల రూపాయిలు. తన చేతికి నెలకు వచ్చేది రెండు వేల రూపాయిలు మాత్రమే. మిగిలిన జీతమంతా కటింగ్స్ రూపంలో పోయేవి. కుమార్ తాగుడు కోసం ఎన్నోసార్లు లోన్లు తీసుకుని ఆ లోన్‌ల ద్వారా వచ్చే వేల రూపాయిల్ని ఒకటి, రెండు రోజుల్లో తప్పతాగి స్వాహా చేసేవాడు. ఆఫీసులోని తన సహ మిత్రులతో, సహ ఉద్యోగులతో తన పిల్లలకు కాలేజ్ ఫీజులు కట్టాలని, పరీక్ష ఫీజులు కట్టాలని, ఇంటి బాడుగ కట్టాలని, ఇంకా ఎన్నో, ఎన్నెన్నో ఇతరత్ర అబద్ధ కారణాలు చెప్పి వారినుండి అప్పుగా డబ్బు తీసుకుని అప్పనంగా తప్ప తాగేవాడు.

ఉద్యోగం నుంచి ఏ అర్ధరాత్రో, అప రాత్రోగాని ఇంటికి వచ్చేవాడు కాదు. ఒక్కోసారి ఇంటికి వచ్చేసరికి రెండు మూడు రోజులయ్యేది. ఆ మూడు రోజులు తన నివాసమంతా బార్‌లోనే. కుటుంబ సభ్యులకు ఆ మూడు రోజులు జాగరణే. వర్మ ఎంత వెతికినా ఎక్కడున్నాడో ఎంత మాత్రం తెలిసేది కాదు. కుమార్‌కు దిన, దిన సుఖం. వీళ్ళకు దిన,దిన గండం. తను ఏ సమయంలో ఎలా వస్తాడో, ఎటువంటి పరిణామాలు చూడాలో అని నిర్భేధ్యంగా బతుకుతూ వస్తున్నారు.

ఓ రోజు కుమార్ తాగి స్కూటర్‌పై వస్తుంటే లారీ తగిలి పెద్ద పెద్ద గాయాలు అయ్యాయి. ఎంతో రక్తం పోయింది. చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనైయింది. ఇంట్లో వాళ్ళందరికి పెద్ద టెన్షన్. ఆరు నెలల పాటు ఏకధాటిగా సపర్యలు చేస్తేగాని మామూలు మనిషి కాలేదు. ఈ ఆర్నెల్లపాటు ఇంట్లో వాళ్ళను సతాయించి ఇంటికే ఎంచ్చక్కా ఇంట్లోవారితోనే మందు తెప్పించుకుని తాగే వాడు. వాళ్ళు కాదు, కూడదంటే ఇంట్లో పెద్ద సుడిగాలి చెలరేగేది. అరుపులు, కేకలు, గందరగోళం ఫలితంగా కుమార్‌కు మందు. ఇంట్లో వాళ్ళు ఈయన ప్రవర్తన భరించలేక భరిస్తూ వచ్చారు. రోజూ ఇంటికి ఎవరో ఒకరు తీసుకుని వస్తేగాని వచ్చే పరిస్థితిలేదు. ఎక్కడ పడితే అక్కడ తప్పతాగి పడిపోయేవాడు. తెలిసిన వాళ్ళు ఎవరయినా ఇంటికి తీసుకువస్తే సరి, లేదంటే ఇంట్లో వారికి వేట తప్పనిసరి.

హైదరాబాద్‌లో అన్నపూర్ణ అక్క కొడుకు పెళ్ళి. పెళ్ళికి అందరూ సిద్ధమయ్యారు. కుమార్‌కు తోడుగా పెద్దమ్మాయి స్వప్నను ఉంచారు. స్వప్న గర్భవతి అయ్యింది. తొమ్మిదో నెల. అన్నపూర్ణ, సుందరి, వర్మలు వీళ్ళ పరిస్థితి భయంకరంగా ఉన్న తప్పనిసరిగా హైదరాబాద్‌కు వెళ్ళారు.

ఆ రోజు మధ్యాహ్నం కుమార్ తప్పతాగి పడిపోతే ఎవరో ఇంటికి తీసుకొచ్చారు. ఇంట్లో స్వప్న ఒక్కత్తే ఉంది. మధ్యాహ్నం అంత మత్తులో ఉన్న కుమార్ కొద్దిగా మత్తు దిగాక మళ్ళీ బార్‌కు బయలుదేరుతుండగా స్వప్న వద్దని నివారించింది. ఎంత చెప్పిన కుమార్ వినలేదు. 'నాన్న నువ్వు బయటికెళితే నేను ఛస్తాను' అని బెదిరించింది. అయినా వినలేదు. ఇంక లాభం లేదనుకుంటూ స్వప్న కిరసనాయిలంతా తన ఒంటిమీద చల్లుకుని అగ్గిపుల్ల తీసుకుని 'నువ్వు బయటికెళితే నేను అంటించుకుంటా'నంది.

అప్రయత్నంగా, అగ్గిపుల్ల ఒంటికి అంటుకుంది. స్వప్న ఒళ్ళంతా మంటలు. ఆ మంటలో అల్లాడిపోతున్న స్వప్న ఇల్లంతా తిరుగుతోంది. కాపాడాలన్న ఆత్రుతతో కుమార్ మత్తులో స్వప్నను గట్టిగా పట్టుకున్నాడు. ఇద్దరు అగ్నికి ఆహుతి అయ్యారు. సారాకు రెండు జీవితాలు బల య్యాయి. ఫలితంగా ఇంట్లో వారికి విచారం, అవమానం, విమర్శలు. కుమార్ జీవితంతో పాటు స్వప్న జీవితం అన్యాయంగా, అనవసరంగా సారాతో బగ్గుమంది. ఒక కుటుంబం సారాతో వీధిపాలయ్యింది. ❋

**ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.**

**- ఎడిటర్**

గురుదేవో మహేశ్వరః

## మీ సమస్యలకు పరిష్కారాలు

**"వేమనారాధ్యస్వామి'**

***నేను మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడిని. నేను ఇంటర్‌మీడియట్ చదివాను. నాకు విద్యారంగంలోను మరియు ఉద్యోగ రంగంలోను ఎక్కువగా అపజయం జరుగుతోంది. మా కుటుంబం చాలా కష్టాలలో ఉంది. నేను మా కుటుంబాన్ని పోషించడానికి ఎంతగానో ప్రయత్నం చేస్తున్నాను కాని నాకు ఏదారి దొరకడం లేదు.***

***నేను 1 1/2 సంవత్సరం పైగా సినిమా ప్రపంచంలోకి పోవటానికి ఎంతగానో ప్రయత్నం చేస్తున్నాను కాని జరగడం లేదు. దయచేసి నాకు ఎలాగైనా సినిమా ప్రపంచంలోకి పోవటానికి దారి చూపించండి. మీరు చూపే దారితో మా పేద కుటుంబం వెలుగులోకి వస్తుంది.***

***- పి. విజయకుమార్, కాంచీపురం***

4.5.2004న చంద్రగ్రహణం. అది దాటిన రెండు నెలల తర్వాత ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేస్తే మంచిది. ముందుగా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రయత్నించండి. చదువుకునే అవకాశం ఉంటే చదువుకోండి. అయిదు సంవత్సరముల పాటు సినిమా ప్రపంచాన్ని మర్చిపోండి. కుటుంబ పోషణ గురించి ఆలోచించండి. ఆ తరువాత ప్రపంచ జ్ఞానం కలుగుతుంది. అప్పుడు మీ ప్రపంచం ఏదో మీకు తెలుస్తుంది. అప్పుడు అందులో ప్రవేశించి స్థిరపడతారు.

***ఈ శీర్షికకు ప్రశ్నలను పంపేవారు, తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, సమయం, నక్షత్రం, నివసించే ప్రాంతం వివరంగా రాసి మాకు పంపండి. వారం వారం మీ ప్రశ్నలకు "వేమనారాధ్యస్వామి'గారు మీ సమస్యలకు ఉపాసనాబలంతో పరిష్కారాలు చెబుతారు.***

***- ఎడిటర్***